# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పల్నాడు జిల్లాలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు, లెక్కింపు కేంద్రాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా.., డీజీపీ హరిష్ కుమార్ గుప్తా పరిశీలించారు.**
2. **పదోతరగతి పరీక్షలలో పున:మూల్యాంకనాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల జవాబుపత్రాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు రాష్ట్ర విద్యాశాఖ తెలిపింది.**
3. **కృష్ణా నదీ యాజమాన్య బోర్డు అధ్యక్షులుగా అశోక్ ఎస్.గోయల్‌ను కేంద్ర జల్ శక్తి శాఖ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.**
4. **మోసపూరిత ఎస్ఎంఎస్ సందేశాల ద్వారా జరిగే మోసాల నుంచి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని టెలికమ్యూనికేషన్స్ విభాగం పేర్కొంది.**
5. **నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సహా పలువురు ప్రముఖులు ఆయనకు నివాళులర్పించారు.**

==========================

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా తెలిపారు. ఈరోజు పల్నాడు జిల్లాలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు, లెక్కింపు కేంద్రాలను డీజీపీ హరిష్ కుమార్ గుప్తా, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాట్కర్, ఎస్పీ మల్లికా గార్గ్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో ఓట్ల లెక్కింపుపై సన్నద్ధత, శాంతిభద్రత చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్నాడు జిల్లాలోని సమస్యాత్మక నియోజకవర్గాల్లో అదనపు బలగాలను నియమిస్తున్నామని తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో పునఃలెక్కింపు, పున:మూల్యాకనాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల జవాబుపత్రాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు దేవానందరెడ్డి తెలిపారు. పునఃలెక్కింపు, పున:మూల్యాకనంలో భాగంగా 55 వేల 966 జవాబు పత్రాలకు దరఖాస్తులు రాగా.. అందులో 43 వేల 714 జవాబుపత్రాలను ఇటీవల వెబ్‌సైట్‌లో పొందుపరచామని, తాజాగా మరో 10 వేల 542 పత్రాలను వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. మిగతా ఒక వెయ్యి 710 జవాబు పత్రాలను త్వరలో విడుదల చేస్తామని చెప్పారు.

---------------------------

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు –కేఆర్ఎంబీ అధ్యక్షులుగా అశోక్ ఎస్.గోయల్‌ను కేంద్ర జల్ శక్తి శాఖ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం చైర్మన్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న శివ్‌నందన్‌కుమార్ ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న క్రమంలో నూతన అధ్యక్షులుగా అశోక్ గోయల్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. జూన్ 1న ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని కేంద్ర జల్ శక్తి శాఖ తెలిపింది.

---------------------------

కేంద్ర హోం శాఖ భాగస్వామ్యంతో చేపట్టిన సంచార్ సాథీ కార్యక్రమంలో భాగంగా ఎస్ఎంఎస్ సందేశాల ద్వారా జరిగే మోసాల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని టెలికమ్యూనికేషన్స్ విభాగం – డాట్ ఒక ప్రకటనలో తెలిపింది. గత మూడు నెలల్లో పలు సంస్థలు 8 ఎస్ఎంఎస్ హెడ్డర్లను ఉపయోగించి 10 వేలకు పైగా మోసపూరితమైన సందేశాలను పంపినట్టు గుర్తించామని కమ్యూనికేషన్స్ విభాగం తెలిపింది. ఈ 8 ఎస్ఎంఎస్ హెడ్డర్లల యాజమాన్యాలను నిషేధిత జాబితాలో చేర్చినట్లు తెలియజేసింది. ఈ సంస్థలకే చెందిన మొత్తం 73 ఎస్ఎంఎస్ హెడ్డర్లు, ఒక వెయ్యి 522 ఎస్ఎంఎస్ కంటెంట్ టెంప్లేంట్లను కూడా నిషేధిత జాబితాలో చేర్చినట్లు పేర్కొంది.

---------------------------

జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రత్యేక పర్యవేక్షకులు బాల్ కృష్ణ గోయల్ ఈరోజు చిత్తూరు జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ప్రధాన ఆసుపత్రిలో అందించే వైద్య సేవలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా అందిస్తున్న సేవలపై చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్‌తో చర్చించారు. అనంతరం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బాల్ కృష్ణ గోయల్ మొదటగా ఉప కారాగారాన్ని సందర్శించించి అక్కడ ఖైదీలకు అందించే వైద్య సేవలను గురించి జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖైదీలతో స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలని, వారికీ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు అందించాలని సూచించారు.

---------------------------

పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుపై ఎన్నికల అధికారులకు ఈ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు జరగనుందని, ఈ క్రమంలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై కౌంటింగ్ సూపర్‌వైజర్‌లు, ఎన్నికల సిబ్బంది, సూక్ష్మపరిశీలకులకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

---------------------------

కోవిడ్ –19 మహమ్మారి సమయంలో ప్రపంచానికి సహాయ సహకారాలను అందించి భారత్ 'ఒకే ప్రపంచం, ఒకే కుటుంబం' అనే స్ఫూర్తిని చాటి చెప్పిందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి అపూర్వ చంద్ర తెలిపారు. నిన్న స్విట్జర్లాండ్ లోని జెనీవాలో జరిగిన ప్రపంచ ఆరోగ్య అసెంబ్లీ కమిటీ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఆరోగ్య భద్రతకు భారత ప్రభుత్వం అనేక చర్యలను చేపట్టిందన్నారు. ప్రజారోగ్య విధానంలో మెరుగైన ఫలితాల కోసం సమాచారం, అవగాహనతో పాటుగా నివారణ చర్యలు వంటి వాటిపై దృష్టి సారించడం

కీలకమని అపూర్వ చంద్ర పేర్కొన్నారు.

---------------------------

నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాళులు అర్పిస్తూ... చలనచిత్ర, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ సేవలు మరువలేనివని తెలుగు సినిమాకు ఆయన గొప్ప స్ఫూర్తి అని కొనియాడారు. వెండి తెరపై ఎన్నో మరుపురాని పాత్రల్లో నటించి మెప్పించారని, దూరదృష్టి కలిగిన రాజకీయ నాయకులని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. కాగా.. ఈరోజు హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ఘాట్‌లో కుటుంబ సభ్యులు, పలువురు నాయకులు నివాళులర్పించారు.

---------------------------

బ్రిటిష్ కాలం నాటి చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం సవరణ చేసిన నూతన నేర చట్టాలను అమలు చేయడాన్ని తిరుపతి న్యాయవాదులు స్వాగతిస్తున్నారు. సంవత్సరాల తరబడి న్యాయస్థానాల చుట్టూ తిరిగే కక్షిదారులకు కొత్త చట్టాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జులై ఒకటో తేదీ నుంచి సవరించిన చట్టాలను అమలు చేయడం ద్వారా ప్రజలకు న్యాయవ్యవస్థ మరింత చేరువయ్యే అవకాశం ఉందని తిరుపతికి చెందిన న్యాయవాదులు జి. శ్రీనివాసులు, భవానీ శంకర్ ఆకాశవాణికి తెలుపుతూ,

వాయిస్ 25 సెకన్లు

---------------------------

ఓట్ల లెక్కింపు ప్రక్రియను ముందస్తు ప్రణాళికతో విజయవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. అమలాపురంలో నిన్న ఓట్ల లెక్కింపులో పాల్గొనే అధికారులకు తొలివిడత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వివిధ దశలు, పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలన్నారు.

---------------------------

అనంతపురం జిల్లాలో ఉన్న రెండు విభిన్న ప్రతిభావంతుల వసతి గృహాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ఎస్.అబ్దుల్ రసూల్ తెలిపారు. 3వ తరగతి నుండి డిగ్రీ వరకు చదివే వారు దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాల కొరకు 08544 - 232380 నంబరుకు సంప్రదించాలని లేదా నేరుగా కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

---------------------------

తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ ఎం.కె బెహరా నిన్న విశాఖపట్నంలో పర్యటించారు. వాల్తేర్ డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ ఇతర అధికారులతో కలిసి విశాఖ రైల్వే పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యకలాపాలను పరిశీలించి, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మౌలిక సదుపాయాల కల్పనకు

తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.  ఈ సందర్భంగా ఎం.కె. బెహరా మాట్లాడుతూ రైల్వే డివిజన్ పరిధిలో పెరుగుతోన్న రవాణాకు అనుగుణంగా రైల్వే విద్యుదీకరణ, నవీకరణ పనులు చేపట్టాలని పేర్కొన్నారు.

---------------------------

విశ్వవిద్యాలయాలకు  పరిశోధన  గ్రాంట్లు ఎక్కువగా ఉంటే మెరుగైన పరిశోధనా ఫలితాలు వస్తాయని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు అన్నారు. కాకినాడలో విశ్వవిద్యాలయాల అధిపతులతో నిన్న పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎడెక్స్ సంస్థ, ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా కొత్త సాంకేతికతలు, బోధన పద్ధతులు అభివృద్ధి చేశాయని తెలిపారు. వీటిపై ఉన్నత విద్యామండలి సహకారంతో ప్రతి విశ్వవిద్యాలయంలో  అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం 6 వేల మందికి శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు.

======================